# సమ్మోహనం



—కాకాని కమల

యూనివర్శిటి కాంపస్ సందడిగా ఉంది.

బాటని, జువాలజి డిపార్ట్‌మెంటు పి.జి. స్టూడెంట్సు అమ్మాయిలు అబ్బాయిలు సందడిగా అటు ఇటు తిరుగుతున్నారు.

డిపార్ట్‌మెంటు తరవున "సుందర దీవులు" బొటానికల్, జువలాజికల్ టూర్ వెడుతున్నారు.

సుమారు పదిహేను గంటలు పైగా ప్రయాణం. సగంపైగా దూరం. ట్రైన్ మీద వెళ్ళి అక్కడ్నుంచి రెండున్నర గంటలు స్టీమ్ బోటు మీద ప్రయాణం చేస్తే "సుందర దీవులు" వస్తాయి.

మూడు వైపులా నీళ్ళు. ఒక వైపు దట్టమైన అరణ్యం. మధ్యన ఉన్నాయి సుందర దీవులు.

అక్కడ ఎక్కువగా ట్రైబల్స్ నివసిస్తారు. అక్కడ ప్రకృతి సంపద సహజ వనరులు ఎక్కువ.

ముఖ్యంగా విశేష ఔషధీగుణాలు కలిగిన రకరకాల మూలికలు, ఫల, పుష్ప భరితలైన వృక్షాలు విశేషంగా ఉండటమే కాక అడవుల్లో అపురూపంగా కనిపించే వింత వింత మృగాలు, వనచరాలు, నానాటికీ కరువై పోతున్న పక్షి జాతులకి ఆ సుందర వనాలు పెట్టింది పేరు.

అందుకే అటవీశాఖ వారు యాత్రికుల్ని, విద్యా సంస్థల్ని ఆకర్షించటం కోసం ఒక అద్భుతమైన బొటానికల్ గార్డెన్ని "జూ"ని ఏర్పాటు చేశారు.

అంతేకాక సుందర దీవులు పేరుకి తగినట్లే సహజ ప్రకృతి దృశ్యాలతో అందమైనవి.

నింగిని తాకుతున్నాయా అనిపించే వృక్షజాతులు. చుట్టూ వున్న కొండ కోనల్లోంచి హెూరున కురిసే జలపాతాలు, రంగు రంగుల పుష్పాలు, చేతికి అందుతాయా అన్నట్లు కదిలే మేఘమాలికలు......

అయితే ప్రయాణం సుగమం కాదు. రైలు మార్గంలో కూడా అడుగడుగునా గండాలు అన్నట్లు అరణ్యాలతో, రైలుమార్గాన్ని అవరోధించే ఏనుగుల గుంపులతో, పొంగి పొర్లే వాగువంకలతో క్లిష్టంగా ఉంటుంది దారి.

ఆ అడవుల్లో క్రూర మృగాలతో పాటు దొంగల గుంపులు ఎక్కువ అని ప్రతీతి. అయినా యువరక్తం పొంగిపొర్లే విద్యార్థులు ఆ భయాలన్నింటిని పక్కకి నెట్టి ఉత్సాహంగా సుందర దీవులు ప్రయాణం అయ్యారు.

దాదాపు నలభై మంది దాకా ఉన్నారు విద్యార్థినీ విద్యార్థులు.

వాళ్ళల్లో చాలా మంది రిసెర్చి చెయ్యాలన్న దృఢ సంకల్పంతో వున్నవాళ్ళు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ నుంచి ఎక్స్‌ప్రెస్ బయలు దేరుతుంది.

వీళ్ళ కోసం రెండు బోగీలు రిజర్వ్ చేశారు.

ట్రైన్ సమయానికి స్టూడెంట్సు అంతా ఎవరి లగేజి వాళ్ళు పట్టుకుని కాంపస్ ఎదురుగా వున్న లోకల్ స్టేషన్‌కి వచ్చి సికింద్రాబాద్ చేరుకున్నారు.

ఆడా — మగా అన్న తేడాలు మరిచి స్టూడెంట్సు అంతా సందడిగా కల్సిపోయారు.

కాని వాళ్ళ వాళ్ళ పరిచయాలని బట్టి స్నేహాలని బట్టి గ్రూపులుగా విడిపోయారు.

శిరీష, ఆశాలత, సుహాసిని, రాధిక, మణిమోహన్, సిద్ధార్థ, కృష్ణకుమార్, జయసింహ వృధ్వి ఒక గ్రూప్గా చేరి నవ్వులు జోక్స్‌తో హెూరెత్తిస్తున్నారు.

ఆఖరికి ప్రొఫెసర్స్ కూడా ఒక గ్రూప్‌గా అయ్యారు.

కాని ఏ గ్రూపులోనూ చేరకుండా ఒంటరిగా ఏకాకిలా మిగిలిపోయిన ఒకే ఒక వ్యక్తి రణధీర్!

లోకంలోని నిరాశా నిస్పృహ అంతా తన ఒక్కడికే స్వంతం అన్నట్లు చాలా నిశ్శబ్దంగా మూడీగా ఉన్నాడు.

కాని అతని చూపులన్నీ రాధిక చుట్టూ తిరుగుతున్నాయ్.

రాధిక కూడా చూసి చూడనట్టు వాలుకంట రణధీర్‌ని గమనిస్తూనే ఉంది. అయినా ఆవిషయానికి పెద్ద ప్రాముఖ్యం ఇవ్వనట్టు ఫ్రెండ్సు మధ్య చేరి అల్లరి చేస్తోంది. రాణాని ఉడికించటానికన్నట్లు అవసరానికి మించి నవ్వుతూ జోక్స్ పేలుస్తూ కబుర్లు చెప్తోంది.

అదంతా రాణా గుండెకి కత్తికోత.

"ఆమె తన ప్రేమని ఏనాడైతే తృణీకరించిందో అప్పుడే తనని తాను మరణించిన వాడి కింద జమకట్టుకున్నాడు!

అంతలో ఎక్స్‌ప్రెస్ పెద్దగా కూత పెడుతూ "ధన్ ధన్" మని శబ్దం చేస్తూ ప్లాట్‌ఫాం మీదకి వచ్చింది.

ఒక్కసారి ప్లాట్‌ఫాం అంత కలకలం రేగింది.

దిగేవాళ్ళు దిగిపోగానే స్టూడెంట్సు అంత గబగబా రెండు బోగీల్లో సర్దుకున్నారు.

శిరీష ఆశాలత, సుహాసిని, రాధిక, మణిమోహన్, సిద్ధార్థ, కృష్ణకుమార్, జయసింహ కూడా ఒక గ్రూపుగా రైలు ఎక్కబోయారు.

"ఈ రద్దీలో అప్పుడే మీరెందుకు. మేం ముందెళ్ళి సామాన్లు పెట్టి వెనక సీట్లు చూసి వస్తాం" అన్నాడు కృష్ణకుమార్ అమ్మాయిల కేసి ఆరాధనగా చూస్తూ.

"అవును. మనం అందరం సర్దాగా ఒక చోట కూర్చుందాం, ఆ సామాను ఇటిచ్చి మీరిక్కడే వుండండి" అన్నాడు మణి.

"మేమేం చిన్న పిల్లలం కాదు. మా సామాన్లు మేం పట్టుకుని ఎక్కగలం" అంది వెక్కిరిస్తున్నట్లు సుహాసిని.

"అలాగా? పారాడే పసిపాపలేమో... ఎక్కలేరు అనుకున్నాను" అన్నాడు జయసింహ.

"నన్నెవరన్నా ఎత్తుకుని ఎక్కిస్తానంటే హాయిగా ఒప్పుకుంటాను" అన్నాడు మణి సుహాసినిని కసిగా తపనగా చూస్తూ.

"నీ అమ్మనో బొమ్మనో తెచ్చుకోవాల్సింది. ముద్దు ముద్దుగా ఎత్తుకుని ఎక్కించేది" అంది సుహాసిని వుడికిస్తున్నట్లు.

"నిజమే... కాని... బొటానికల్ టూర్కు బొమ్మలతోటి అమ్మలతోటి వెళ్ళరనుకుంటాను..." అన్నాడు కొంటెగా కళ్ళ చివర్లలో ఆమెని పరిశీలిస్తూ.

ఎరుపు పసుపు కాంబినేషన్‌లో కాటన్ చూడిదార్‌లో వున్న ఆమె అందం అతడ్ని అలరిస్తోంది.

ఇంతలో బోగి కిటికి దగ్గర్నుంచి సిద్ధార్థ చెయ్యి ఊపుతూ—

"తొందరగా రండి. మనందరికి కార్నర్‌లో సీట్లు పెట్టాను" అంటూ సంబరంగా కేకేశాడు.

అంతే గబగబా సామాన్లు పట్టుకొని బోగి లోకి ఎక్కాడు.

అప్పటికి స్టూడెంట్సంతా చాలా వరకు బోగీల్లోకి ఎక్కారు. కాని ప్రొఫెసర్లు ఎక్కలేదు. ఫ్లాట్‌ఫాం మీద నిల్చుని అందర్నీ పర్యవేక్షిస్తున్నారు.

వాళ్ళతో పాటు రాణా కూడా ఎక్కలేదు.

ఫ్లాట్‌ఫాం మీద ఒక స్థంభానికి ఆనుకొని చేతులు కట్టుకుని నిశ్శబ్దంగా నిల్చున్నాడు.

రెండు బోగీలు వాళ్ళకే కేటాయించారు.

కాని రాధిక ఎందులో ఎక్కితే అందులో ఎక్కాలని అతని ఆలోచన.

అబ్బాయిలంతా ఒకవైపు, అమ్మాయిలంతా ఒకవైపు సర్దుకున్నారు.

సామానంతా పై బెర్త్‌మీద సర్దాడు కృష్ణ.

"నేను కిటికి దగ్గర" అంది రాధిక.

"కిటికి దగ్గర కూర్చుందామని సంబరబడేది చిన్న పిల్లలు" అన్నాడు సిద్ధార్థ.

"మరి నేను చిన్న పిల్లని కాక ముసలమ్మనా?" అంది రాధిక పోట్లాటకి వస్తున్నట్లు.

"ముసలమ్మవి కాక పోయినా మరీ చిన్న పిల్లవి కూడా కాదు కదా?" అన్నాడు రెండు చేతుల్లో దోసిలి పట్టి ఉయ్యాల వూపుతున్నట్లు. "చిన్నవాళ్ళకయినా పెద్ద వాళ్ళకైనా. ప్రయాణం ఒక సరదా" అంది ఆశాలత.

"అవును" సమర్థించాడు మణిమోహన్.

బుట్టలోంచి ఖాళీ బాటిల్స్ తీసి కిందకి దిగాడు జయసింహ.

మిగతా ముగ్గురబ్బాయిలు కూడా కిందికి దిగారు—

"కాఫీలు తాగుతారా?" అన్నాడు కృష్ణ అమ్మాయిల కేసి చూస్తూ.

"వద్దు" అన్నారు.

"కాఫీ వద్దనక పోవటం ఏమిటి? ఫరవాలేదు. పట్టించుకొని రారా..." అన్నాడు మణి.

"అవును. మంచి కాఫీ తాగుదాం" అంటూ అబ్బాయిలు కిందికి దిగారు. ఐదునిమిషాల్లో పొగలు కక్కే నెస్ కేఫ్ ట్రేలో పట్టించుకొని వచ్చాడు కృష్ణ.

అంతా కాఫీలు తాగేలోపల—

"ఎక్స్‌ప్రెస్ డిపార్చర్‌కి సిద్ధంగా ఉందని" మైక్‌లో అనౌన్సుమెంటు వినిపించింది.

అంతలో జయసింహ, సిద్ధూ, మణి, కృష్ణ చేతుల నిండా పళ్ళు, బిస్కట్లు, మాగ్‌జైన్స్, నీళ్ళ బాటిల్స్ పట్టుకుని వచ్చారు.

సరిగ్గా అదే క్షణంలో రైలు పెద్దగా కూత వేసి చిన్న "జర్క్" ఇచ్చినట్లు కదిలింది.

ఫ్లాట్‌ఫాం మీద నిల్చున్న ప్రొఫెసర్లు రెండు పెట్టెల్లోకే సర్దుకున్నారు.

రణధీర్ రన్నింగ్ ట్రైన్‌తో నడుస్తూ జంప్ చేసినట్లు రాధిక వాళ్ళు కూర్చున్న బోగిలోకి ఎక్కాడు.

ఓరకంట ఆ విషయాన్ని గమనించి కూడా గమనించనట్లుగా ఉండిపోయింది రాధిక.

అతడు తనని నిఘా వేశాడని తెలుసు. తనని సాధించటానికే అలా మూడీగా సర్వస్వం కోల్పోయిన విరాగిలా వున్నాడని తెల్సు. అదంతా నటన అని ఆమె అభిప్రాయం.

కాని...

నటనతో ఒక ఆడపిల్ల "ప్రేమ"ని గెలవగలరా?

అందుకే ఆమె రాణాని ఏడిపించటానికన్నట్లు రెట్టించిన ఉత్సాహంతో ఫ్రెండ్సుతో... ముఖ్యంగా అబ్బాయిల్తో కబుర్లు చెప్పటం మొదలు పెట్టింది.

ఈ ప్రయాణం మూలంగా రాణాని మరింత ఏడిపించాలన్నదే ఆమె పంతం.

ఇంతలో ట్రైన్ మళ్ళీ ఒకసారి గట్టిగా కూసి వేగాన్ని వుంజుకుంటూ ఫ్లాట్‌ఫాం దాటింది.

రణధీర్ ఎదురుగా ఉన్న బెర్త్‌కి అటు చివర ఒంటరిగా వున్న సీట్లో కూర్చున్నాడు.

పెద్దగా వున్న ఆ బోగీలో స్టూడెంట్స్ గ్రూపులుగా విడిపోయి సరదాగా కబుర్లలో పడ్డారు. అవటానికి రెండు పదులు నిండిన పి.జి. స్టూడెంట్స్ అయినా ఆ ప్రయాణ సందోహంలో పసిపాపల్లా మారిపోయారు. ఎటు చూసినా నవ్వులూ కేరింతలు. కొందరైతే కార్డ్స్, చెస్, లాంటి ఆటసామగ్రి బయటికి తీశారు. కొందరు పుస్తకాలు తిరగేస్తున్నారు. రాణా కూడా బ్యాగ్ లోంచి ఇంగ్లీషు మాగ్‌జైన్ తీసి పేజీలు తిప్పటం మొదలు పెట్టాడు. కాని అతని దృష్టి, మనసు, చెవులు అన్నీ రాధికపైనే వున్నాయి.

### క్యారీవైట్ మృతి

ప్రపంచంలో అత్యంత వయోవృద్ధురాలిగా గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించిన అమెరికాకు చెందిన క్యారీవైట్ యిటీవల మరణించింది. ఆమె వయసు 116 సంవత్సరాలు. గత నవంబర్ 18 న క్యారీవైట్ జన్మదిన సందర్భంగా ప్రపంచప్రముఖులు ఎందరో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. కనీసం మరొక పది సంవత్సరాలు జీవించగలదనుకున్న క్యారీవైట్ మరణానికి ఎందరో తమ సంతాపం తెలియచేశారు.

అది గమనించిన సుహాసిని "ఏమిటే నీ ఆరాధకుడు మరీ అంత దేవదాసులా పోజుపెట్టాడు. ఆ గెడ్డం అదీ పెంచుకుని" అంది రాధిక చెవి దగ్గర నోరు పెట్టి గుసగుసలాడుతున్నట్లు.

రాధిక ముఖం చిట్లించింది.

"అంతా ఒట్టి నటన." అంది నిర్లక్ష్యంగా.

"ఏమిటి? మీలో మీరే మాట్లాడుకుంటున్నారు?" అన్నాడు పృధ్వీ ఆరాగా.

"ఏదో ఒకటి మీకు చెప్పాలని రూలుందా?" అంది సుహాసిని.

"అఫ్‌కోర్స్...లేదనుకోండి. కాని మాకూ చెప్తే విని సంతోషిస్తాంగా" అన్నాడు.

"ఒకళ్ళు విని సంతోషించేది కాదు" అంది రాధిక.

సిద్ధార్థ బిస్కట్లు ప్యాకెట్లు తీశాడు.

"తిండిపోతు...అప్పుడే" వెక్కిరించింది శిరీష.

"అప్పుడే ఏముంది? నాకు ఆకలేసింది. తింటున్నాను. ఎద్దుకి వున్నది బలం. మనిషికి తిన్నది బలం" అన్నాడు.

"తప్పు మనిషికి వున్నది బలం. ఎద్దుకు తిన్నది బలం అనాలి." అన్నాడు మణి.

"ఒరేయ్ సిద్ధూ. నువ్వు తెలుగులో మరీ ఇంత పూరేమిట్రా?" అన్నాడు కృష్ణకుమార్.

"విలువవున్నా లేకపోయినా మన మాతృభాషని మనదేశాన్ని మనం గౌరవించాలి" అంది సుహాసిని.

"చిత్తం. ఆపని నువ్వు చెయ్యి. ఈ పని మేం చేస్తాం" అంటు చిప్సు ప్యాకెట్ ఓపెన్‌చేసి కరకరకర నవలటం మొదలు పెట్టాడు.

"పిండిగిర్ని నయం నీకంటె" వెక్కిరించింది రాధిక.

"మరి మాకేవి చిప్సు?" అడిగింది శిరీష.

"మేం డబ్బిచ్చి కొనుక్కొన్నాం. ఇవన్నీ మాకే" ఊరించాడు పృధ్వీ.

"అలాగా?" అంటూ గభాల్న ఒంగి అతని చేతుల్లోంచి ప్యాకెట్టు గుంజుకుంది అమూల్య.

అమ్మాయిలంతా కిలకిలా నవ్వారు. రాణాకేసి ఓరగా చూస్తూ రాధిక మరింత గట్టిగా నవ్వింది.

అమూల్య చేతిలోని ప్యాకెట్టు అందుకుంటూ "ఇప్పుడిది మా చేతిల్లో ఉంది గనక ఇంక మేం తింటాంచూడు" అంటూ అమ్మాయిలందరికీ పంచింది.

"సోకు ఒకడిది సొమ్ము ఒకడిది" అన్నాడు సిద్ధార్థ.

"కాదు. సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అనాలి. సామెత మళ్ళీ తప్పు చెప్పావ్" వెక్కిరించింది రమ.

సిద్ధార్థ నవ్వి—

"తప్పుకాదు. అర్థం చెడకుండా ఎలా చెప్పినా తప్పుకాదు." అన్నాడు వితండ వాదానికి దిగుతూ.

కాని అమ్మాయిలు ఒప్పుకోలేదు.

"ఎలా అవుతుంది? దేనికైనా ఒక పద్ధతి, క్రమం ముఖ్యం. అంకెలు చెప్పాలంటే ఒకటి రెండు మూడు...అంటు చెప్తాంగాని నాలుగు ఆరు రెండు సున్న ఒకటి ఏడు అంటూ చెప్పంకదా?" నిలదీసింది అమూల్య.

శిరీష అందుకుంటూ 'అవును దేనికైనా ఒక పద్ధతి క్రమం ముఖ్యం. అన్నం తింటే ముందు పప్పు, కూర, పచ్చడి, పులుసు తిని ఆఖర్న మజ్జిగతో తింటాం. అంతేగాని ముందు మజ్జిగతో తిని తర్వాత పప్పు కూర తినం కదా?" పాయింటు తీసింది.

"తినం. కాని తింటే తప్పేమిటి? ఎవరన్నా కాదంటారా?" అన్నాడు మొండిగా.

"తప్పులేదు. ఎవ్వరూ కాదనరు. కాని ముందు మజ్జిగ అన్నం తింటే నీళ్ళు నీళ్ళుగ పళ్ళెం అంతా అయి పోతుంది. ఇంక అందులో పప్పు కూర ఎలా కలుపుకు తింటావ్?"

"పళ్ళెం మారిస్తే సరి" అన్నాడు తేల్చేస్తూ...

"ఏడిసినట్లుంది" వెక్కిరించింది సుహాసిని.

"నీకు సుందర దీవులు..జలపాతాలు ఫ్లవర్ గార్డెన్సు ఎందుకు? ఇట్నుంచి ఇటే తిన్నగా మఠానికి పోయి అద్వైత మతం పుచ్చుకో బాగుపడతావ్" అంది రాధిక వెక్కిరిస్తున్నట్లు.

దూరంగా కూర్చున్న రాణా–ఆ మాటలు మనసుకి గుచ్చుకున్నట్లు అసహనంగా మూల్గాడు. లీలగా అది గమనించిన కృష్ణ "వేరే పుచ్చుకోవడం ఎందుకు. వీడిది అద్వైత మతమే. రోజూ లేవగానే ముందు కాఫీ తాగి ఆ తర్వాత పళ్ళు తోముతాడు." అన్నాడు.

"అలాగా?" అంటూ సుహాసిని గబాల్న బుట్ట లోంచి అరటిపండుతీసి తొక్కవలిచి పండు కిటికి లోంచి బయటికి పారేసి సిద్ధూకి తొక్క అందించి "తిను" అంది.

సిద్ధార్థ జంకులేకుండా తొక్క నోట్లో పెట్టుకుని

నములటం మొదలు పెట్టాడు.

అది నోట్లో ఇమడక బయటికి వచ్చేస్తుంటే మళ్ళీ నోట్లోకి తోసుకున్నాడు.

ఆ దృశ్యం చూసిన పెట్టెలోని వాళ్ళంతా ఫెల్లున నవ్వటం మొదలు పెట్టారు.

పదినిముషాలసేపు కంపార్టుమెంటు నవ్వులతో మారు మ్రోగిపోయింది.

రాణా మాత్రం మొఖం గంటు పెట్టుకున్నట్టు సీరియస్‌గా కూర్చున్నాడు. వాళ్లంతా — ముఖ్యంగా రాధిక నవ్వుతూ జల్సాగా ఉండటం అతనికి ఉక్రోషంగా ఉంది.

అప్పటికి సమయం రాత్రి ఎనిమిది గంటలు దాటు తూంది. రైలు చాలా స్టేషన్లు దాటినట్టుంది.

చీకట్లని చీల్చుకుంటు కొండలు గుట్టలు చెట్లు చేమలు దాటుకుంటూ అరణ్య మార్గం గుండా రైలు వేగంగా పోతూంది.

కిటికిలోంచి చల్లగాలి వీస్తోంది.

"నువ్వు అన్నీ చూడొచ్చని కిటికీ దగ్గర కూర్చున్నావ్ గాని...రాత్రిపూట చీకట్లో ఏం కనిపించదోచ్" అన్నాడు రాధికనిచూసి ఉడికిస్తున్నట్టు పృధ్వీ.

"నేనేం సీనరీలు చూడాలని కూర్చోలేదు. చెట్లమీంచి వచ్చే చల్లని గాలి కోసం కూర్చున్నాను" అంది రాధిక.

"గాలితోపాటు బొగ్గు నలుసులుకూడా కంట్లో పడతాయి. అప్పుడవుతుంది అమ్మాయిపని" అన్నాడు మణి

రాధిక నవ్వింది.

"ఏం పడవు బాబూ! ఇది బొగ్గింజనుకాదు. డీజిల్" అంది.

"రాతియుగం." హేళన చేసింది అమూల్య.

రైలు వేగంగా పోతూంది.

"సర్దాగా ఏదన్నా ఆడుకుందామా?" అన్నాడు కృష్ణ.

"రైల్లో ఏం ఆట?" అంది సుహాసిని

"ఎందుకు లేవు? ఇండోర్ గేమ్సు బోల్డున్నాయ్" అంటు బ్యాగ్‌లోంచి క్యూబ్, చెస్, కార్డ్సు బయటికి తీశాడు.

అంతలో మీల్స్ బుకింగ్ కోసం క్యాంటీన్ క్లర్క్ చిన్న పుస్తకంతో లోపలికి వచ్చాడు. చాలామంది భోజనం ఆర్డరు చేశారు. కాని కొంతమంది చపాతీలు ఆర్డరు చేశారు. రాణా ఏమి ఆర్డరు చెయ్యలేదు.

అది గమనించిన అమూల్య "ఏంటే రాధి నీ లవ్వర్ అన్నం తినడా?" అంది చెవిదగ్గర చిన్నగా గొణుగుతున్నట్టు.

రాధిక నిర్లక్ష్యంగా తల విసిరింది.

"తినకపోతే మానెయ్యమను. అతను తింటే మన కడుపు నిండుతుందా?" అంది.

అంతా ఆటల్లో పడ్డారు.

అరగంట తర్వాత రైలు నెమ్మదిగా కూతవేస్తు క్రమంగా వేగాన్ని తగ్గించుకోసాగింది.

ఏదో స్టేషన్ వస్తూంది.

"ఇప్పుడు మీల్స్ వస్తాయి. భోజనంచేసి మళ్ళీ ఆట వేద్దాం" అంటు కృష్ణ చెస్, కార్డ్సు తీసి బ్యాగ్‌లో పెట్టాడు.

ఒకరి తర్వాత ఒకరు టాయిలెట్‌లోకి వెళ్ళి చేతులు శుభ్రం చేసుకుని వచ్చారు.

అంతలో రైలు మళ్ళీ గట్టిగా కూత వేస్తూ నెమ్మది అయ్యింది.

స్టేషన్ వచ్చింది.

అది మరీ పెద్ద స్టేషన్ కాదు. చిన్నదే. చీకట్లో బోర్డుకూడా సరిగా కనిపించటంలేదు.

కాని దూరంగా క్యాంటీన్ లైట్లు హడావుడి కనిపిస్తూంది.

'పాంట్రీకార్'లోంచి సర్వర్లు మీల్స్ ప్లేట్లు దించి సప్లై చేస్తున్నారు.

వీళ్ళ బోగిలోకికూడా సర్వర్స్ చేతులనిండా ప్లేట్లు పట్టుకుని లోపలికి వచ్చారు.

అంతా తలా ఒక ప్లేటు తీసుకున్నారు.

అప్పటికే కృష్ణ, మణి కిందకి దిగి బాటిల్స్ నిండా నీళ్ళు పట్టుకొని వచ్చారు.

ట్రైన్ స్టార్టయ్యింది.

అంతా సర్దాగా కబుర్లు చెప్పుకుంటు తినటం మొదలు పెట్టారు. రాణా ఏం తినకుండా నిశ్శబ్దంగా కిటికిలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు.

అది గమనించిన కొందరు స్టూడెంట్సు "వాట్ మిస్టర్ రాణా! నువ్వు మీల్స్ ఆర్డర్ చెయ్యలేదా?" అన్నారు ఆశ్చర్యకరంగా

"లేదు." అన్నాడు నిర్లిప్తంగా రాణా.

"ఎందుకని"

"ఆకలిగా అనిపించటం లేదు."

"ప్చ్! అనిపించేదేమిటిమాన్. తినటమే. హేవ్ సమ్‌థింగ్", అంటూ ఎవరో చపాతి కూర అందించారు.



## పురుషులు - స్త్రీలు

స్త్రీల కన్నా పురుషులే కొన్ని 'విషయాలలో 'మొదటిస్థానంలోకి వస్తారనీ అమెరికాలోని ఒక సంస్థ జరిపిన పరిశీ లనలో తేలింది.

అప్పు యివ్వడంలో స్త్రీలతో పోలిస్తే పురుషులే ముందుకు వస్తారనీ, ఆపదలో అప్పు యిచ్చి ఆదుకోవడంలోనే కాక అప్పు యిచ్చి చేతులు కాల్చుకోవడంలోనూ పురుషులదే మొదటి స్థానమనీ ఆ పరిశీలనలో పేర్కొన్నారు.

ఆత్మహత్య చేసుకుని జీవితం చాలించే పురుషులు స్త్రీల కన్నా మూడు రెట్లు ఎక్కువనీ, త్రాగిన నేరానికి, త్రాగి వాహనాలు నడపిన నేరానికి, జూదం ఆడినందుకు, మాదకద్రవ్యాలు తీసుకున్నందుకు అరెస్ట్ అయ్యే పురుషులతో పోలిస్తే స్త్రీలు లెక్కలోకే రారనీ ఆ పరిశీలనలో వెల్లడయింది.

ఇంక బాగుండదని మొఖమాటంగా తిన్నాడు రాణా.

అతనిలో హుషారు లేదు. ముఖం దీనంగా ఉంది.

కారణం తెల్సిన కొందరు రాణాకేసి రాధికకేసి తేరిపారి చూసి రహస్యంగా ఏదో చర్చించుకున్నారు.

ఒక అరగంటసేపు నవ్వులు జోక్స్‌తో భోజనాలు పూర్తికానిచ్చి ఖాళీ ప్లేట్లు పక్కకి పడేశారు.

అప్పటికి సమయం రాత్రి పదిగంటలు కావస్తూంది.

సుష్టుగా తినటంతో అందరికి నిద్ర వస్తున్నట్లు బడలికగా అనిపించసాగింది.

ఆడపిల్లలు అతి కష్టంతో ఆవులింతలు ఆపుకుంటున్నారు. మందారపువ్వుల్లా వాళ్ళ కళ్ళు ఎర్రబడటం గమనించిన కృష్ణకుమార్—

"ఓ.కె. ఆడపిల్లలు పాపం అలసిపోయినట్లున్నారు. కాసేపు హాయిగా పడుకోండి. మేం అటు ప్రక్కగా కూర్చుంటాం" అంటు లేచి బెర్త్ పరిచాడు.

లైటార్పి చిన్నలైటు వేశాడు.

ఆడపిల్లలు అందరూ ఇద్దరిద్దరు చొప్పున బెర్త్‌ల మీద సర్దుకొని బ్లాంకెట్ కప్పుకున్నారు.

రైలు వేగంగా పోతూంది.

అడవి మార్గం కావటంతో దారంతా అటూ ఇటు దట్టమైన చెట్లు చేమలతో కొండ కోనలతో నిర్మానుష్యంగా చీకటిగా ఉంది.

కిటికీలోంచి చల్లగాలి తెరలు తెరలుగా వీస్తూంది.

"మనం కాస్సేపు పేక ఆడుకుందామా?" అంటు పృధ్వీ లేచి పై బెర్త్‌మీద పెట్టిన బ్యాగ్‌లోంచి పేక తియ్యబోయాడు.

సరిగ్గా అదే క్షణంలో భూనభోంతరాళాలులు దద్దరిల్లినట్లు శబ్దం వచ్చింది.

"కీచు" మని శబ్దం చేస్తూ రైలు సడన్ బ్రేక్‌తో ఆగిపోయింది. ఒక పెద్ద రాక్షసుడు రెండు చేతుల్తో రైలు బోగీలను పట్టుకొని గట్టిగా కదిలించినట్లు పెట్టెల్లోని జనం అంతా కకావికలం అయ్యారు.

పై బెర్తులమీద పేర్చినట్లు పెట్టిన సామాను దణదణ మంటూ పక్కకి పడిపోయింది.

పెద్దపెట్టున హాహాకారాలతో పెట్టెల్లోని జనం అంతా బిలబిలా రైలు దిగిపోయారు. పెద్ద వెలుగు వేడి వేడి సెగలు చిమ్ముకు రాసాగింది.

పిల్లల ఏడుపులు, పెద్దవాళ్ళ కేకలు, హాహాకారాలతో క్షణంలో వాతావరణం భయానకంగా చిన్న సైజు రణరంగంలా మారిపోయింది.

రైలు అగ్ని ప్రమాదానికి గురి అయ్యింది.

అప్పటికే ప్రక్కనున్న రెండు రైలుపెట్టెలు నిప్పంటుకొని నింగికెగసిఅగ్ని కీలల్తో భగ భగ భగ మండసాగినయ్. దట్టమైన నల్లని పొగ సుడులు సుడులుగా చుట్టుకుంటూ గాల్లోకి లేస్తూంది.

రాత్రిపూట...పైగా చలి విపరీతంగా ఉండటంతో కిటికి తలుపులన్నీ మూసివున్నాయి.

దాంతో ఆ మంటలకి పొగకి లోపలి ప్రయాణీకులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

బోగీ ఎంట్రన్స్ తలుపులు కూడా గట్టిగా లాగి గడియలు బిగించటంతో లోపలి మంటలు బయటికి రాలేక దట్టమైన పొగలు నల్లని కారు మబ్బులు కమ్ముతున్నట్లు బోగీ నిండా ఆక్రమించసాగాయి.

సీట్లకివున్న స్పాంజి, కరంటు వైరులు క్షణాల్లో అంటుకొని ఫట్‌ఫట్‌మన్న ప్రేలుడు శబ్దంతో దగ్ధం కాసాగాయ్.

లోపల కిక్కిరిసి కూర్చున్న ప్రయాణీకులు, పిల్లా పెద్ద, ముసలి ముతక భయంతో వెర్రి కేకలు పెట్టసాగారు.

ఆ మంటల వేడికి తళతళ పొగలో ఏదీ కనిపించక హాహాకారాలు చేస్తున్నారు.

రైలు పెట్టెలకు నిప్పంటుకోవటంతో రైలు ఆగిపోయింది.

అప్పటికే చాలామంది జనం రైలుదిగిపోయి భయంతో కేకలు పెడుతూ అటు ఇటు పరిగెత్తసాగారు.

ఇంజన్ డ్రైవరు, గార్డు, తదితర రైల్వే సెక్యూరిటి...అంతా కిందికి దిగి నిస్సహాయంగా ఆ మంటల్ని చూస్తూ నిల్చోవటం తప్ప ఏం చెయ్యలేని దశలో ఉన్నారు. తగినన్ని నీళ్ళు గాని ఇసుకగాని అందుబాటులో లేవు.

అగ్ని ప్రమాదానికి గురి అయిన బోగీలకి అటు ఇటువున్న పెట్టెలకివున్న కనెక్షన్స్‌ని తప్పించారు రైల్వే సిబ్బంది.

ఇంజన్‌కూడా రైలునుంచి విడి వడి దగ్గర్లోవున్న స్టేషన్‌వైపు దూసుకుని పోయింది.

అంతలో బోగీలోవున్న ఎంట్రన్స్ తలుపుల్ని బైట నుంచి ఇనప రాడ్సుతో ఫోర్స్‌గా కొట్టటంతో తలుపులు గభాల్న తెరుచుకున్నాయి.

లోపల కొమ్ములో కాలుతున్నట్లు క్రిక్కిరిసిన జనం

ఒకరొకరు తగులుకుంటూ కిందికి దూకసాగారు.

ఆ తోపులాటలో పసిపిల్లలు వృద్ధులు మరింత నలిగిపోతూ.. ఆమంటల్లోంచి.. పొగలోంచి కిందికి దూకలేక వెర్రికేకలు పెట్టసాగారు. దాంతో ఎంట్రన్స్ దగ్గర తోపులాట మరింత ఎక్కువైంది.

ఆ హృదయవిదారకమైన దృశ్యాన్ని చూస్తున్న ప్రయాణీకుల గుండెలు జలదరించసాగాయి. అంత వరకు దూరంగా నిల్చుని ఆ మండుతున్న పెట్టెకేసి విభ్రాంతిగా చూస్తున్న రాణా ఒక్కసారి ఒంటి మీదకి స్పృహ వచ్చినట్లు త్రుళ్ళి పడ్డాడు.

ఎవరో బలంగా వెనకనుంచి తోస్తున్నట్లు గభాల్న ఆ మండుతున్న పెట్టెలోకి దూకాడు.

మంటలకి తాళలేక పెట్టెలో ఇమడలేక గగ్గోలెత్తుతున్న పిల్లల్ని వృద్ధుల్ని స్త్రీలని రెక్కపట్టి బయటికి నెట్టసాగాడు.

కాని వాళ్ళని రక్షించే ప్రయత్నంలో అతని శరీరాన్ని అగ్ని ఆవహించసాగింది. అతని దుస్తులకు నిప్పంటుకొని మండసాగాయి.

అయినా ఆబాధని నిశ్శబ్దంగా భరిస్తూ లోపలున్న జనాలని బయటికి లాగసాగాడు.

దాదాపు మంటల మధ్య నిల్చున్నట్లుంది అతని పరిస్థితి.

అది గమనించిన ప్రొఫెసర్స్, తోటి విద్యార్థులు గుండె చెదిరినట్లు - "రాణా! కమ్‌డౌన్... ప్లీజ్... కమ్‌డౌన్" అంటు అరుస్తూ చేతులు ఊపసాగారు.

ఆడపిల్లలు కూడా గగ్గోలు పెడుతున్నట్లు అరవసాగారు.

కాని వాళ్ళ కేకలు ఆ గందర గోళంలో రాణాని చేరలేదు. ఒక ప్రొఫెసర్ ధైర్యం చేసి బోగి ఎంట్రన్స్ దగ్గరికి వెళ్ళి తలుపు దగ్గర నిల్చున్న రాణాని గట్టిగా బయటికి లాగబోయాడు. కాని వేయి నాల్కలు సాచి విజృంభిస్తున్న ఆమంటలకి తాళలేక ఆ తొక్కిసలాటలో నిలవలేక వెనక్కి వచ్చేశాడు.

ఆడపిల్లలు దాదాపు ఏడ్చేస్తున్నారు.

రాధిక సంగతి సరేసరి. ఆమె దుఃఖం పట్టలేకుండా ఉంది.

కాని రాణా మాత్రం నిలువునా మంటల్లో కమిలిపోతూ బోగిలోని ప్రయాణీకుల్ని రక్షించటంలో నిమగ్నం అయిపోయాడు.

అంతలో నల్గురు విద్యార్థులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు మూకుమ్మడిగా ఎంట్రన్స్ దగ్గరికి దూకి రాణా దుస్తుల్నిలాగి గట్టిగా పట్టుకుని గభాల్న కిందికి లాగారు. అప్పటికి స్పృహ తప్పే స్థితిలో ఉన్నాడు రాణా.

స్టూడెంట్స్ అంతా అతన్ని దాదాపు మోస్తున్నట్లు ఎత్తి దూరంగా తీసుకెళ్ళి గడ్డిలో పడుకోపెట్టారు. అతని ఒంటిమీద మిగిలిన దుస్తుల్ని గబగబా విప్పి మంటలు ఆరేలా నేలమీద అటు ఇటు పొర్లించారు.

ప్రయాణీకుల్లో కొందరు డాక్టర్లు ఉండటంతో వాళ్ళు గాయపడ్డవారిని చికిత్స మొదలుపెట్టారు.

ఒక డాక్టరు రాణాకి ప్రాథమిక చికిత్స ప్రారంభించాడు.

అర్ధరాత్రి.... అడవి ప్రాంతం. చిట్టచీకటి.

రైల్వేవాళ్ళు వెలిగించి పెట్టిన పెట్రోమాక్స్‌లైట్లు కాంతి తప్పించి వేరే వెలుగు లేదు.

ప్రయాణీకుల అరుపులు, కేకలు, గాయపడ్డవారి మూల్గులు, ఏడుపులతో అంత భీకర రణరంగంలా ఉంది.

అంతలో పక్కస్టేషన్‌కి వెళ్ళిన ఇంజన్ వేగంగా తిరిగి వచ్చింది.

ఇంజన్‌తో పాటు గణగణగణ గంటల మోగించుకుంటు నీళ్ళ లారీలు వచ్చాయి.

ఆ వెనకే అంబులెన్స్‌లు, వైద్యబృందం, కాకీ బస్సులు, లైట్లు కూడా వచ్చాయి.

వైద్యబృందం హుటాహుటిన రంగంలోకి ధిగి గాయపడ్డవారికి ప్రాథమిక చికిత్స చేసి అంబులెన్సుల్లోకి ఎక్కిస్తున్నారు.

రాణాకి ఒంటిమీద అక్కడక్కడ కాలిన గాయాలు తప్పించి ప్రాణభయం ఏమీలేదు.

కాని అతను ఎంట్రన్స్ దగ్గర నిల్చోవటం వల్ల లోపల్నుంచి వచ్చిన పొగ అంతా ఆతడి శరీరం చుట్టుకున్నట్లు నల్లగా కమ్ముకొంది. దుస్తులు అంటుకోవటంతో శరీరం కొన్నిచోట్ల బాగా కాలి బొబ్బలెక్కింది.


ఆవేడిమికి అతను శోష వచ్చినట్లు సొలిపోతున్నాడు.

అతడ్ని చూస్తుంటే రాధికకు దుఃఖం ఆగడంలేదు.

ఎవ్వరూ పెదవి కదిపి చెప్పకపోయినా రాణా దుస్థితికి తను కారణం అన్నట్లు అంతా తనకేసి దోషిని చూసినట్లు చూస్తుంటే భరించలేకపోయింది రాధిక.

అంతవరకు కూడ గట్టుకున్న గాంభీర్యం, అతనిపై తెచ్చి పెట్టుకున్న కోపం కరిగిపోసాగాయ్.

అప్రయత్నంగా ఆమె చేతులు హ్యాండ్ పర్సులో దాచిన ఉత్తరాన్ని అపురూపంగా స్పర్శించ సాగింది.



బాల కార్మికులు

మనదేశంలో వివిధ పరిశ్రమలలో అయిదున్నర కోట్ల మందికి పైగా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు యిటీవల ఒక సర్వేలో వెల్లడయింది.

దుర్భర ఆర్థికపరిస్థితుల కారణంగా బాల కార్మికుల సంఖ్య పెరుగుతోందనీ, తోలు, గాజు, కార్పెటు పరిశ్రమలలో బాల కార్మికులు చెప్పుకోదగిన సంఖ్యలో వున్నారనీ కేంద్ర కార్మిక సంక్షేమ శాఖా మంత్రి శ్రీ రాంజేలాల్ తెలియజేస్తూ మహిళల, బాలల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడానికి ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు.

సరిగ్గా వారం రోజుల క్రితం రాణా రాసిన ఉత్తరం అది!..—

డియర్ రాధి,

గత రెండు సంవత్సరాలుగా అల్లుకున్న మన ప్రేమని నీస్వ కూకటి వేళ్ళతో కదిలిస్తుంటే నా మనసు నలిబిలి అయిపోతూంది. నాకు వేరే ఎవరో అమ్మాయితో వ్యవహారం ఉందని ఎవరో గాలివార్త సృష్టించి చెపితే అదే నిజమని నీవు నమ్మావు. స్వచ్ఛమైన నా ప్రేమను శంకించావు. నీ నిర్లక్ష్యంతో నీ ప్రవర్తనలో పాలలాంటి నా మనసుని విరిచేస్తున్నావు. స్వర్గాన్ని చూపించిన నీవే నరకం ఎలా వుంటుందో కూడా చూపిస్తున్నావు. కాని అంతటి నిర్లక్ష్యాన్ని ఈ పేదగుండె సహించలేదు రాధి. నన్ను కాదని నీవు పరాయి అబ్బాయిల్తో సర్దాగా ఉండటం చొరవగా ప్రవర్తించటం.... ఓహ్..... తలవు మాత్రానికే నా గుండె ద్రవం అయిపోతూంది.

మీ అందరితో పాటు 'సుందరదీవులు' విహార యాత్రకి నేనూ వస్తున్నాను. కాని మీ అందరిలా వినోదం కొసమో విజ్ఞానం కోసమో కాదు. నా ప్రేమని పరీక్ష పెట్టుకొని నా నిజాయితీని నిరూపించుకోవటం కోసం!

నా దేవత రాధి నన్ను కరుణించిందా ఈ విహార యాత్ర మీ అందరితో పాటూ వినోదయాత్ర అవుతుంది. లేదూ... నారాధి నన్ను శపించిందా... విషాదయాత్రగా నాజీవితాన్ని అక్కడే అంతం చేసుకుంటాను.

నిన్ను బెదిరించటానికో పిరికితనంతోను నేను ఈ నిర్ణయానికి రాలేదు.

ఈ వైఫల్యాన్ని ఈ నీవియోగాన్ని నేను భరించలేను. రాధి...... నన్ను నమ్ము.

—రణధీర్.

ఉత్తరంలోని ప్రతి అక్షరం ప్రాణం పోసుకొన్నట్లు మళ్ళీ ఒక్కసారి రాధిక మనసులో కదిలింది.

ఒకప్పుడు తమ ప్రేమ అమరం... అజరామరం అనుకుంది. కాని అనూహ్యంగా తమ మధ్య అగాధాలు ఏర్పడ్డాయి. తన్నుగాక రాణాకి వేరే అమ్మాయితో పరిచయం ఉందన్న ఆలోచనే తను భరించలేకపోయింది. అక్కడికీ రాణా చాలా సార్లు తన ప్రేమలోని నిజాయితీని నిరూపించుకోవాలని చూశాడు.

కాని తను అతనికా అవకాశాన్ని ఇవ్వలేదు. కావాలని అతన్ని తప్పించుకొని తిరిగింది. అతని మీద కక్షతో మిగతా అబ్బాయిల్తో మరింత సన్నిహితంగా, లేని చనువు నటిస్తూ ప్రవర్తించసాగింది.

అదంతా రాణా గుండెకి కత్తికోత.

ఆఖరికి అతను ఆవేదనతో రాసిన ఆ ఉత్తరాన్ని కూడా అపహాస్యంగానే తీసుకుంది.

కాని ఇప్పుడు రాణా చేసిన తెగింపు, ప్రాణాలని సైతం లెక్క చెయ్యకుండా అతడు చేసిన సాహసం చూస్తుంటే అతని మనసు ఎంతగా విరక్తి చెందిందో అర్థం అవుతూంది.

రాధిక కళ్ళనుంచి ధారగా కన్నీళ్ళు జారిపోతుంటే దూకినట్లు గభాలన ముందుకి పరిగెట్టింది.

కాని అప్పటికే గాయపడ్డ రాణాని అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

అతనితో పాటు ఇద్దరు ప్రొఫెసర్స్, ఇద్దరు స్టూడెంట్సు కూడా వెళ్ళటానికి ఉద్యుక్తులయ్యారు.

చెక్కిళ్ళపై ధారగా జారిపోతున్న కన్నీటిని తుడుచుకొంటు—

"సార్! రణధీర్‌తో పాటు నేనూ వస్తాను. ప్లీజ్....." అంది రాధిక దీనంగా చేతులు జోడిస్తూన్నట్లు. కారవన్‌లో అప్పటికే రణధీర్‌కి - రాధికకి మధ్య ఏర్పడ్డ ప్రణయకలహాన్ని ఆనోట ఈనోట విన్న ప్రొఫెసర్స్ ముఖాలు చూసుకున్నారు.

"ప్లీజ్ సార్" అంది రాధిక.

ఒళ్ళంత కాలిన గాయాలతో భగభగ గంట పెడుతుంటే దాదాపు స్పృహ తప్పిపోతున్న స్థితిలో ఉన్న రాణా హృదయం పులకరించినట్లు అయ్యింది.

ప్రియనెచ్చెలి రాధిక మాటలు చెవుల్లో అమృతం పోసినట్లు వినిపిస్తుంటే మూసుకుని పోతున్న కనురెప్పల్ని అతి కష్టంతో తెరుస్తూ రాధిక కేసి చూశాడు.

అతని కళ్ళనిండా ఆనందం తొణికిసలాడుతూంది.

చీకటిలో చిరుకాంతిలో బిగుసుకుపోతున్న అతని పెదవుల మీద చిన్న చిరునవ్వు కదిలింది.

రాధిక అప్పటికే అంబులెన్స్‌లోకి ఎక్కి అతని పక్కన కూర్చుంది.

ప్రయాణంలో ప్రమాదం జరిగినా చివరికి ప్రమోదంగా మారబోతున్నందుకు అందరి హృదయాలు తేలిక పడ్డాయి.

అబ్బాయిలు అమ్మాయిలు వీడ్కోలు చెపుతున్నట్లు అభిమానంగా చేతులు ఊపుతుంటే అంబులెన్స్ నెమ్మదిగా ముందుకు కదిలింది. □